TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 249 | మంగళవారం 01-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

# కేసీఆర్ రాజీనామా చేయాలి..

## ఆందోళనలకు పిలుపునిచ్చిన సీఎం

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఘాటైన వ్యాఖ్యలతో తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి అంటూ సీఎం ఫైర్ అయ్యారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు పదవులు కట్టబెట్టారని విమర్శించారు. తాను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. 'పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో మేం ఏం చేశామో అసెంబ్లీకి చర్చకు సిద్ధం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలపై తీవ్ర విమర్శలు చేశారు.

### ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ అభివృద్ధి..

హైదరాబాద్ అతివేగంగా విస్తరిస్తోందని.. ఈ మహానగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా మారిందని.. ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడుతోందన్నారు సీఎం. వివిధ రంగాలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. మౌలిక వసతుల విస్తరణ కూడా అవసరం అని పేర్కొన్న సీఎం.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ జరగడం లేదన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం చెప్పారు.

### 3 భాగాలుగా తెలంగాణ..

అభివృద్ధి కోసం తెలంగాణను 3 భాగాలుగా విభజించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ పక్కన నివసించేవారి పరిస్థితి అత్యంత దయనీయం అని.. మూసీకి వరదలు వస్తే ప్రజలు ఎంతో నష్టపోతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముసారాంబాగ్ వంతెనను ఎందుకు నిర్మించలేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత రెండేళ్లలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. పదేళ్లలో అంబర్‌పేట్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారా అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ఎక్కడో ఊరి బయట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారంటూ విమర్శించారు.

### ప్రజల సమస్యలను పట్టించుకోలేదు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని సీఎం రేవంత్ ఆరోపించారు. పేదల కష్టాలు తమకు తెలుసునని.. అందుకే ఇళ్లు కట్టిస్తున్నామని సీఎం అన్నారు. బతుకమ్మకుంటను చెరబట్టింది ఎవరో అందరికీ తెలుసునని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి ఆరోపణలు గుప్పించారు సీఎం. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువు లేకుండా.. బతుకమ్మకుంటను కబ్జా చేశారన్నారు. హైడ్రాను పంపి బతుకమ్మకుంట చెర విడిపించామని చెప్పారు. ఆడబిడ్డలకు బతుకమ్మకుంటను బహుమతిగా ఇచ్చామన్నారు. మళ్లీ బతుకమ్మకుంట కబ్జాకు యత్నిస్తున్నారంటూ సీఎం ఆరోపించారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నాం తప్ప.. వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు తాము కట్టుకోలేదన్నారు.

### 1000 రోజుల ప్రజాపాలన..

ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని సీఎం రేవంత్ తెలిపారు. ప్రజా ప్రభుత్వంపై బురద జల్లాలను కుట్రలు చేస్తున్నారంటూ విపక్షాలపై సీఎం



- కేసీఆర్‌పై సీఎం రేవంత్ తీవ్ర విమర్శలు
- 'కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి'
- కేసీఆర్ రాజీనామాకు 6 రోజుల ఆందోళనలు
- పదేళ్ల పాలనపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమన్న సీఎం
- హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికలు
- రెండేళ్లలో ముసారాంబాగ్ బ్రిడ్జి పూర్తి
- పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడి
- రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు
- రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు
- ఉచిత బస్సుల కోసం ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు
- 3 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ
- గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపణ
- ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు ఇస్తున్నామని వెల్లడి

పేజి 2లో ▶

## విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో!..

### డీఎంకే ఎద్దేవా



తమిళనాడు సీఎం విజయ్‌ను 2029 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థి గా టీవీకే పార్టీ ప్రచారం చేస్తుండడం అక్కడి రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రచారాలపై ప్రతిపక్ష డీఎంకే పార్టీ విమర్శలు గుప్పిస్తుండగా.. మిత్రపక్షమైన కాంగ్రెస్ సైతం వ్యతిరేకిస్తోంది. అసలేమైందంటే

2లో

## రాష్ట్రపతి వద్ద విధులు..

### 12 ఏళ్లకే రిటైర్మెంట్: ఎవరీ మేజర్ రిషభ్..?



2లో

- 4 పారా స్పెషల్ ఫోర్సెస్‌లో విధులు నిర్వర్తించారు.
- ప్రఖ్యాత 'బలిదాన్ బ్యాడ్జ్' అందుకున్నారు.
- 2021 రిపబ్లిక్ డే పరేడ్‌లో జాట్ రెజిమెంట్ దళానికి నాయకత్వం వహించారు.
- 2023లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆణజగా ఎంపికయ్యారు.
- రాష్ట్రపతి వెంట అధికారిక కార్యక్రమాల్లో కనిపిస్తూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు.
- నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్ ఇచ్చారు.

## హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం:

- హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం: మంత్రి పొన్నం.
- శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలలో రూ.15 కోట్లతో హాస్టళ్లకు శంకుస్థాపన.
- ఏడాది క్రితం ప్రారంభమైన కళాశాలలో ప్రవేశాలు 175కు పెరిగాయి.
- విద్యార్థుల కోసం కొత్త కోర్సులు తీసుకొస్తామని వెల్లడి.



2లో

## విశాఖలో ఏఐజీ హాస్పిటల్స్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన

### ఎండాడలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్ ఏర్పాటు.

- ఐదేళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు.
- ప్రాజెక్టుతో 9,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- పూర్తయిన తర్వాత ఆసుపత్రిలో 1,000 పడకలు అందుబాటులోకి రానున్నాయి.
- 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయనున్నారు.
- ఏఐజీ ఛైర్మన్ డా. డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి లోకేశ్ భూమిపూజ చేశారు.



విశాఖపట్నం: ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ(గూ×+) ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు. రూ.2వేల కోట్ల పెట్టుబడి, 9వేల మందికి ఉద్యోగ అవకాశాలు విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది.

## వెలిగొండ ద్వారా కృష్ణా జలాల తరలింపు.

- రేవంత్ ప్రభుత్వం మౌనం వహిస్తోందని విమర్శ.
- తెలంగాణలో సాగునీటి కష్టాలు పెరుగుతున్నాయన్నారు.
- భీమా, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులకు నీటి కొరత.
- ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తోందని ఆరోపణ.
- తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని డిమాండ్.



2లో

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి: డిప్యూటీ సీఎం పవన్

### పర్యావరణ నిబంధనలు కచ్చితంగా పాటించాలి.

- పరిశ్రమల్లో 33% పచ్చదనం తప్పనిసరి: పవన్ కల్యాణ్
- పచ్చదనం పెంపు సామాజిక బాధ్యతగా తీసుకోవాలి.
- రాష్ట్రంలో సుమారు 3,400 పరిశ్రమలు ఉన్నాయి.
- 26 పరిశ్రమల్లో 129 ఎకరాల్లో పచ్చదనం పెంపు.
- 33% పచ్చదనం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
- 2047 నాటికి 50% పచ్చదనం లక్ష్యంగా పనిచేయాలి.



2లో

# సంపాదకీయం

## ఆరుద్ర మహాసముద్రం

"క విత కోసమె నేను పుట్టాను, క్రాంతి కోసం కలం పట్టాను" అన్న ఆరుద్ర పుట్టింది 1925 ఆగస్టు 31. ప్రయోగ వాదిగా, అంత్య ప్రాసల ముద్ర ఆరుద్రగా పలు ప్రక్రియా వైవిధ్య సంభరితుడుగా, సినిమా కవిగా తెలుగు సాహిత్యంలో ఆరుద్ర ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకొన్నాడు.

"నీలాల నింగిలో ఎర్ర జెండా తోడ, విశ్వ వీణా రవపు విజయ గానమ్ముతో విజయ శంఖారావ విశ్వగీతమ్ముతో కొత్త మార్గాలపై, కొత్త మార్గాలకై కదలవే, కదలవే" అని బావుటా ఎగరేసి కవిత్వపు కాగడాను తన 17వ యేట 1942 లోనే పట్టి పురోగమించారు. ఆయన ఇంటరు మొదటి సంవత్సరం వరకే చదివారు. ఇంటరులో ఆయనకు ఇంగ్లీషు చెప్పిన గురువు రోణంకి అప్పలస్వామి. ఆరుద్ర తన 'త్వమేవాహం' కావ్యాన్ని వారికే అంకితమిచ్చారు. ఆరుద్ర 1948 జులై 10 తర్వాతే 'త్వమేవాహా'న్ని మొదలుపెట్టినప్పటికీ ప్రథమ ముద్రణ వెలువడింది జులై 1949. 'త్వమేవాహం' అప్పట్లో సంచలనం. నిజాముకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ పోరాటం నేపథ్యంగా రాయబడిన కావ్యమది. భాషలో ఆరుద్ర ప్రయోగాలు పాఠకులను అదిరిపాటుకు గురి చేశాయి. "బ్రెయిన్‌లో బ్రెన్ గన్, రెయిన్‌లా ఆలోచనల ట్రైన్, స్పయినల్ కార్డులో స్పెయిన్, గ్లూమీ తిమిరాలు చెరిషించి, సైతాను మనల్ని పరిషించునపుడు, నిర్వేదనా పవనాలు వర్షించు, బ్రెయిన్‌లో స్టెన్ గన్లా చెట్లూ చిట్టెలుకలు, చెయిన్సులో మగవాళ్లు, చెరచబడ్డ ఆడవాళ్లు, స్నో తెలుపు, డ్యూతెలుపు" -- ఇలా బుల్లెట్లలా పదాలు దూసుకొచ్చేసరికి ఆ ఇంగ్లీషు మాటల దూకుడు, ఆ ప్రతీకలు ఆనాటి పాఠకులకు కొరుకుడుపడక వింతగా చూశారు. ఆరుద్ర హృదయాంతర్గత వేదనను, మెదడులోని అలజడిని దాశరథి వివరించిన తరువాత కొంతమందికి అర్థమైంది. దాశరథి 'అగ్నిధార', సోమసుందర్ 'వజ్రాయుధం' రెండూ తెలంగాణా పోరాట నేపథ్యంలో 1949 లోనే వెలువడ్డాయి. "మేధాశోధన నాళికలో కాలాన్ని పోసి, మండుతున్న గుండెల మీద మరగ బెడతాను. మానవాళికి పనికి వచ్చే ఫలితాల కోసం పాటుపడతాను, పాటకడతాను, కాలాన్ని పట్టి తెచ్చి రాటకేసి కట్టేస్తాను. కాలాన్ని మీకు బానిసగా చేస్తాను. కళ్లల్లో జ్యోతులు వెలిగిస్తాను. భూతల స్వర్గానికి తలుపులు తీస్తా"నని తన ఆకాంక్షను కావ్యారంభంలోనే చెప్పారు. కావ్యంలో ప్రతీకల ప్రయోగం అద్భుతం. కాలానికి సంకేతం గడియారం. గడియారం మన సంఘం. ఇసుక గడియారం, నీటి గడియారాలు పాత కాలపు సంఘాలు. గంటలు శ్రీమంతులు. నిముషాలు మధ్యతరగతి వాళ్లు. సెకండ్లు శ్రామికులు. చిన్నముల్లు శ్రీమంతుల మనస్తత్వానికి సూచి. పెద్దముల్లు మిడిల్ క్లాసు వాళ్ల భావాలకు బరామీటరు. సెకండ్ల ముల్లు శ్రామిక జనుల ఫిలాసఫీకి కొలబద్ద. స్టాప్ వాచి విప్లవాన్ని టైం చేసే సాధనం. పెండ్యులం నిలకడలేని ఊగిసలాట మనస్తత్వానికి ప్రతీక. 'కీ' విప్లవానికి ప్రోద్బలకారణం. కాలాన్ని ప్రవాహంగా కూడా భావించారు ఆరుద్ర. మృత్యువుతో పోరాడే తెలంగాణా పౌరుల చైతన్యంతో కవి 'త్వమేవాహ'మన్నాడీ కావ్యంలో. అంటే నువ్వేనేనని అభేదాన్ని చెప్పాడు. "ఈమె అయస్కాంతకాంత" అనే ఖండికలో పన్నెండు పాదాలు పన్నెండు అంకెలకు గుర్తు.

పాదానికి ఐదక్షరాలు. ఒక అంకె నుండి ఒక అంకెకు రావటానికి పట్టే ఐదు సెకండ్లకు సూచిక. మొత్తం అరవై అక్షరాలు. అరవై సెకండ్లకు సంకేతంగా నిలుస్తాయి. ఇది గడుసైన శిల్పం. ఆరుద్ర 'టెక్నిక్' లేని కవిత్వాన్ని ఊహించలేనన్నాడు. కెప్టెన్‌ను తండేల్ అనటం, విమానాన్ని గాలిగెద్ద అనటం, డ్రెడ్జర్‌ను తవ్వోడ అనటం లాంటి పద ప్రయోగాలు ఉన్నాయి. దీనిలోనే ఛందః ప్రయోగాలూ ఉన్నాయి. వచన కవితలా సాగిస్తూ ఇది పద్యమే అని అనుమానం రాకుండా మత్తకోకిల, ఉత్సాహం, కవిరాజ విరాజితం, పృథ్వీవృత్తం, తరలం, మందారదామం, లయగ్రాహి, దండకం, కందం లాంటివి పద్యాలు పేర్లు పెట్టకుండా రాశారు. కుందుర్తి 'నగరంలో వాన'లో కూడా ఇలా ఛందః ప్రయోగాలు చేశాడు. వచన కవిత్వమనే అభిప్రాయాన్ని కలిగించారు. ఛందస్సుల రహస్యం తెలిసిన వారే అలా రాయగలరు. "ప్రజ భయపడకూడదు ఇల నిజం గెలుస్తుంది కనుక నీతి వెలుస్తుంది. జరామరణాలిక కల. ధ్వజం కొస నిరంతర సమధర్మం చూస్తాం". ఇది కందపద్యం -- దీనిలోని సందేశంతోనే 'త్వమేవాహం' ముగుస్తుంది.

నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చేయలేవనుకున్నప్పుడు, ఆంగ్ల పదబంధాలను ఉపయోగించటానికి ఆరుద్ర వెనకాడలేదు. ఈ విధానం, ఆరుద్ర మరొక కావ్యం 'సినీవాలి' లోనూ కొనసాగింది. 'సినీవాలి' అంటే అమావాస్య నాడు కనపడే నెలవంక. ఇది నాలుగేళ్ల కొకసారి మాత్రమే కనిపిస్తుంది. చీకటిలో వెలుగు రేఖ ఉన్నట్లే కష్టాల్లో కూడా ఆశారేఖ ఉంటుందనే అర్థంలో కవి ఈ పదాన్ని గ్రహించాడు. డిగ్రీ చదువుకున్న మధ్యతరగతి యువకుడు సూర్యారావు ఉద్యోగాన్వేషణకు పట్టణానికి వెళ్తాడు. క్లర్కు ఉద్యోగం వస్తుంది. నగరంలో గుమస్తా బతుకు బాధలను నగర జీవనాన్ని ఈ కావ్యంలో ఆరుద్ర చిత్రించారు. పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' కావ్యంలో నగర జీవన చిత్రణ ఆరుద్రకు స్ఫూర్తి. ఇందులో నాయకుడు మధ్యతరగతి యువకుడు. కలలబేరగాడు. ఇతడేమంటాడంటే-- "దావానలతుల్యోజ్వల భావానల కీలలోన పడుతూ ఉంటా, భావాలకు బానిసనై కావాలని గాలిమేడ కడుతూ ఉంటా"నంటాడు. ఇది కంద పద్యం. ఇలా ఆరుద్ర ఛందః ప్రయోగాలు చాలా ఉన్నాయి. 'సినీవాలి' కావ్యంలో నాటకీయత ఉంది. పాత్రలు సూర్యారావు, తండ్రి, ముగ్గురు వధువులు, కవి. సూర్యారావు, ఆ యువతులతో జరిపిన సంభాషణలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. తండ్రి: "అబ్బాయీ! నీ చీకటి బ్రతుకులో పెళ్ళామనే పెట్రోమాక్సు లైట్ కావాలి. జీవితం రేడియో సెట్టుకి భర్త ఏరియల్, భార్య ఎర్త్" అంటాడు. "భార్యభర్తలనే ఏరియల్సు, ఎర్తు ఉన్నా ఏకాభిప్రాయమనే విద్యుచ్ఛక్తి లేకపోతే సెట్టు పలకటం సున్నా" అని అంటాడు అబ్బాయి.

# కేసీఆర్ రాజీనామా చేయాలి..

మొదటిపేజీ తరువాయి

తమ ప్రభుత్వం విఫలమైందని కొందరు విమర్శిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామన్నారు సీఎం. ధనిక రాష్ట్రంగా తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. అప్పులకుప్ప చేశారంటూ విమర్శలు గుప్పించారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు ముందు ఉన్న సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు కాగా.. కేసీఆర్ ఒక్కరే రూ.7.50 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు సీఎం రేవంత్. ఈ అప్పుల కోసం నెలకు రూ.7,500 కోట్ల అసలు, వడ్డీ కడుతున్నామని వివరించారు. ఏడాదికి రూ.80-90 వేల కోట్ల అప్పు కడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

### సమయానికి వేతనాలు..

ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నెలకు వెయ్యిమంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నారని.. ఒక్కో ఉద్యోగికి బెనిఫిట్స్ కింద రూ.కోటి ఇవ్వాల్సివస్తోందన్నారు. గత 100 రోజుల్లో రూ.6 వేల కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేశామన్నారు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 6 నెలలకు ఓసారి వేతనాలు ఇచ్చేవారని.. ఇప్పుడు టైమ్ టు టైమ్ వేతనాలు చెల్లిస్తున్నామని సీఎం తెలిపారు.

### వికాసం వైపు తెలంగాణ..

విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామన్నారు సీఎం రేవంత్. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారాయన. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు కట్టామన్నారు. రైతుల కోసం రూ.లక్షా 70 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. తమది ప్రజా ప్రభుత్వం.. ప్రజాపాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. తాము అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలు ఆలోచించాలని సీఎం రేవంత్ కోరారు. 3 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తున్నామన్నారు. కేసీఆర్ ఏనాడైనా రేషన్ కార్డుల గురించి ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ సీఎం అంజయ్య పేరు పెడతామని సీఎం ప్రకటించారు. వరంగల్ టిమ్స్‌కు ప్రొ. జయశంకర్ పేరు పెడతామన్నారు. ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

### కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..?

'కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.' అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు.

# భాజపా కార్యాలయం ముట్టడికి యత్నం.. రామచందర్‌రావు ఆగ్రహం

హైదరాబాద్: భాజపా కార్యాలయాన్ని యూత్ కాంగ్రెస్ ముట్టడికి యత్నించడంపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై భాజపా చేసిన దీక్షకు పెద్దఎత్తున యువత, విద్యార్థులు మద్దతు తెలిపారని.. దీనిని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. యువత, విద్యార్థులను పక్కదారి పట్టించేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు.. తమ పార్టీ ఆఫీస్‌ను ముట్టడికి యత్నించారని విమర్శించారు. తమ కార్యాలయంపై నల్లరంగు పూయడం వారి అవివేకం అన్నారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంది తప్పితే.. పార్టీ కార్యాలయం, నేతల ఇళ్ల మీద దాడి చేయడం సరైంది కాదన్నారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన దానికి ఇప్పుడు యూత్ కాంగ్రెస్ ముట్టడించేందుకు రావడం ఏంటని ప్రశ్నించారు. బిహార్‌లో ఏదో జరిగితే కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఏం సంబంధమో చెప్పాలన్నారు. భాజపా కార్యాలయం, నేతల ఇళ్ల మీదకు వస్తే కాంగ్రెస్ కార్యకర్తలను రోడ్ల మీద తిరగనివ్వమని హెచ్చరించారు.



మరోవైపు కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు బీజేవైఎం కార్యకర్తలు విఫలయత్నం చేశారు. పలువురు కార్యకర్తలు గాంధీభవన్ సమీపంలోకి రాగానే పోలీసులు అడ్డుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు.

ముందస్తు సమాచారంతో పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు బీజేవైఎం కార్యకర్తలను అడ్డుకున్నారు.

**మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంపై దాడి**

నల్గొండ: నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కార్యాలయంపై దాడి జరిగింది. కోడిగుడ్లు, టామాటాలతో భాజపా కార్యకర్తలు దాడి చేశారు. హైదరాబాద్‌లో భాజపా కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ యువజన విభాగం ప్రయత్నించింది. దీంతో ప్రతిగా భాజపా ఈ దాడి చేసింది. ఈ నేపథ్యంలో నల్గొండ భాజపా కార్యాలయం వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు.

**ఏపీ మంత్రి కారును అడ్డుకున్న పోలీసులు**

బర్కత్‌పురా భాజపా కార్యాలయం వద్ద ఏపీ మంత్రి సత్యకుమార్ కారును పోలీసులు అడ్డుకున్నారు. కారులో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ ఉండడంతో ఆపారు. గణేశ్‌ను కారులోంచి దించి ముందుకు వెళ్లాలని సూచించారు. యూత్ కాంగ్రెస్, భాజపా నిరసనల నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# ప్రశాంత్‌రెడ్డికి నా ఉసురు తగులుతుంది: కవిత

నిజామాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహార్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. "హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల



రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారు.

ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహార్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు. కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు" అని కవిత చెప్పారు.

# హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతాం:

మొదటిపేజీ తరువాయి

హుస్నాబాద్ : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దన్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ సమీపం ఉమాపూర్‌లోని శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి సుమారు రూ. 15 కోట్లతో నిర్మించనున్న వసతి గృహ భవనాలకు సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభించిన ఈ కళాశాలలో ప్రవేశాల సంఖ్య 175కు పెరిగిందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకొస్తానన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు.

హుస్నాబాద్లో ఇంజినీరింగ్ కళాశాల మండలంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. చిగురుమామిడి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, సైదాపూర్ మండలంలో అదనంగా మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం చెప్పారు. భీమదేవరపల్లి మండలంలో నవోదయ పాఠశాల ఎల్కతుర్తి మండలంలో త్రిపుల్ ఐటీ బ్రాంచ్ రాబోతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ, మరో స్టేడియాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని, రేపటి భవిష్యత్తులో మంచి ప్లేస్మెంట్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, పుర అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ ద్వారా కృష్ణా జలాల తరలింపు.

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ! తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ర్వ భుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం" అని హరీశ్ రావు అన్నారు.

# విజయ్.. ఐరాస చీఫ్ కూడా అవుతారేమో!..

మొదటిపేజీ తరువాయి

టీవీకే సీనియర్ నేత, రెవెన్యూశాఖ మంత్రి కె.ఎ.సెంగోట్టైయన్ ఇటీవల తిరుప్పూర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ తాను ఎంజీఆర్, జయలలితతో కలిసి పనిచేశానని, విజయ్ వారికి మించిన శక్తిగా ఉన్నారంటూ కొనియాడారు. ఆయన తమిళనాడుకే పరిమితం కారని, దేశాన్ని సైతం పాలిస్తారని వ్యాఖ్యానించారు. ఇటీవల టీవీకే (ుఎఖ) చేసిన ఓ సర్వేలోనూ మోదీ, రాహుల్ గాంధీ తర్వాత ప్రధాని అయ్యే అవకాశం విజయ్‌కు ఉందని తేలింది. దీంతో టీవీకే నేతలు విజయ్‌ను భావి ప్రధానిగా అభివర్ణిస్తున్నారు. దీనిపై డీఎంకే (ణవీఖ) కార్యదర్శి భారతి స్పందిస్తూ.. ఊహించుకోవడానికి హద్దుల్లేవు గనక వారు ఏమైనా అనుకుంటారంటూ విమర్శలు గుప్పించారు. విజయ్‌ను ఐరాస అధిపతిని చేస్తామని కూడా అంటారేమో అని ఎద్దేవా చేశారు.

**పార్టీని విమర్శించండి.. దేశాన్ని నిందించకండి**

టీవీకే ప్రచారాన్ని కాంగ్రెస్ సైతం తప్పుబట్టింది. 2029 ఎన్నికల్లో తమ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థిగా నిలబడతారని.. టీవీకే ఆయనకు మద్దతు ఇవ్వకపోతే తమిళనాడు మంత్రివర్గం నుంచి వైదొలుగుతామని సీనియర్ నేత మాణికం ఠాగూర్ హెచ్చరించారు. ప్రతి సర్వే ప్రజాభిప్రాయాలను ప్రతిబింబించదని పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల విషయంలో తమ పార్టీకి స్పష్టమైన ప్రణాళిక ఉందన్నారు. విజయ్‌కు మిత్రపక్షంగా ఉన్న ఎండీఎంకే (వీణవీఖ) సైతం ఈ వార్తలను వ్యతిరేకించింది. ఇండియా కూటమి తరఫున ప్రధాన మంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీ మాత్రమే ఉంటారని తెలిపింది. ప్రధాని కావాలని విజయ్ ఆశిస్తారని కూడా తాము అనుకోవట్లేదని పేర్కొంది. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయొద్దని టీవీకే నేతలకు సూచించింది.

# రాష్ట్రపతి వద్ద విధులు..

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రపతి 'ఎయిడ్-డి-క్యాంప్' (ూణజ) మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అంటే వెంటనే అందరూ గుర్తించకపోవచ్చు. కానీ ద్రౌపదీ ముర్ము (ణతీశీబజూఖఎఱ వీబతీఎబ) అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారి అనగానే వెంటనే గుర్తుపడతారు. సోషల్ మీడియాలో ఆయనకు ఉన్న క్రేజ్ అలాంటిది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది. 12 ఏళ్లపాటు సైన్యంలో పని చేసిన రిషభ్ .. వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లు పేర్కొన్నారు.

**ఎన్‌డీఏ నుంచి రాష్ట్రపతి భవన్‌కు..**

32ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (చీణూ)లో చేరారు. మిలిటరీ స్టడీస్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అభ్యసించారు. '4 పారా స్పెషల్ ఫోర్సెస్'లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత 'బలిదాన్ బ్యాడ్జ్'ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా 'జాట్ రెజిమెంట్' దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 2023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయన కెరీర్ కీలక మలుపు తిరిగింది.

**అయోధ్య మందిరానికి రూ.4 కోట్ల చెక్కు.. ఖాతాలో రూ.3**

రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం, ప్రొటోకాల్‌ను అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. రిషభ్ రిటైర్మెంట్‌పై రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి వివరణ రాలేదు. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి: డిప్యూటీ సీఎం పవన్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

# భూముల రీసర్వే కచ్చితత్వంతో పూర్తి చేయాలి: కలెక్టర్ గరిమ అగర్వాల్

- రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా పనులపై సమీక్ష సమావేశం రెవెన్యూ, సర్వే, అటవీ శాఖల సమన్వయంతో వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని తహసీల్దార్లకు సూచన

రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 31 ప్రజాదివాస్

జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖల సమన్వయంతో కచ్చితత్వంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా, ఎస్ఐఆర్, 22ఏ తదితర అంశాలపై సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా భూముల రీ సర్వే పురోగతి, వివిధ అంశాలపై తహసీల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వేలో భాగంగా భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించాలని, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో సర్వే ప్రారంభానికి ముందు ఆయా సర్వే నంబర్ల వివరాలను ప్రజలకు చేరవేయాలని చెప్పారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర సంబంధిత పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, సరిహద్దుల సర్వే సమయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి తహసీల్దార్ భూముల రీ సర్వే, భూ భారతి, సాదాబైనామా, ఎస్ఐఆర్







ప్రక్రియలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# గన్నేవారిపల్లెలో పౌర హక్కుల దినోత్సవం

ముస్తాబాద్/ ఆగస్టు 31 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గన్నవారిపల్లె గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్ రేసు రఘు అధ్యక్షతన ఎస్సీ ఎస్టీ అంటరానితనం నిర్మూలనకై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌర హక్కుల దినోత్సవం గన్నె వారి పల్లెలో అధికారులు మరియు ప్రజలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు గ్రామంలో ఎలాంటి అస్పృశ్యత అంటరానితనం లేదని ప్రజలందరూ కలిసికట్టుగా ఉంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రఘు ఉపసర్పంచ్ కోదాటి రాజు జిపిఓ రమేష్ ఆర్ ఐ ప్రవీణ్ పోలీస్ అధికారి భూమయ్య అంబేద్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షులు రేసు కిషన్ వార్డు సభ్యులు దేవేందర్ చందు శృతి కిషన్ రజిత శ్రీనివాస్ పలువురు గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు

# జిల్లా కేంద్రంలో సంచార జాతుల విముక్తి దినోత్సవం కార్యక్రమం

ముస్తాబాద్/ ఆగస్టు 31 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంచారజాతుల విముక్తి దినోత్సవ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమమును వెనుకబడిన అభివృద్ధి జిల్లా శాఖ అధికారి సౌజన్య సంచార జాతుల విముక్తి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ వీరముష్టి జిల్లా అధ్యక్షులు ఆగుల రాజేశం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు సంచార జాతుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పట్న అందించాలని అలాగే సంచార జాతుల పిల్లలకు గురుకుల పాఠశాలలో ఎలాంటి రాత పరీక్షలు లేకుండా అడ్మిషన్ అందించాలని ఇట్టి కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినందుకు సంచార జాతుల జిల్లా సంఘం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో సంచార జాతుల జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ వీరముష్టి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఆగుల రాజేశం ముస్తాబాద్ అధ్యక్షులు అగుళ్ల రవి మిట్టపల్లి సాయికుమార్ మరియు వేములవాడ సంఘం నుండి మల్యాల అంజయ్య బాణాల గోపి జిల్లా ఉపాధ్యక్షులు సిరిసిల్ల సంగం టు నుండి మల్యాల దేవరాజు మరియు గొల్లపెల్లి సంఘం నుండి మిట్టపల్లి శేఖర్ సిరిసిల్ల తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పేరుతో భూసేకరణ.. తొమ్మిదేళ్లుగా పరిహారం లేదు!

- చెరువు కట్టక్రింది భూ యజమానులకు న్యాయం చేయాలి: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు

వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాస్

వేములవాడ పట్టణంలోని చెరువు కట్టక్రింది ప్రాంతంలో అభివృద్ధి పేరుతో 2017లో సేకరించిన భూములకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పాటు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని బీజేపీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు ఆరోపించారు. ఈ సమస్యపై సోమవారం జిల్లా కలెక్టర్, వైటీడీఏ వైస్ చైర్మన్‌లకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గెజిట్ నంబర్ +/29/2017 పరిధిలో సుమారు 20 ఎకరాల 20 గుంటల భూమిని రాజన్న ఆలయ అభివృద్ధి కోసం భూసేకరణ చేసినప్పటికీ, దాదాపు తొమ్మిదేళ్లు





గడిచినా అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని పేర్కొన్నారు. అదే సమయంలో భూమి యజమానులకు నష్టపరిహారం కూడా చెల్లించకపోవడంతో సుమారు 200 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. భూముల్లో కొంతమందికి వారసత్వంగా హక్కులు ఉండగా, మరికొందరు తమ పిల్లల విద్య, వివాహాలు, భవిష్యత్ అవసరాల కోసం కొనుగోలు చేసిన భూములు సేకరణ పరిధిలోకి వచ్చాయని చెప్పారు. భూముల వినియోగంపై సంవత్సరాలుగా అనిశ్చితి కొనసాగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేపడతామని హామీలు ఇచ్చినా అమలు కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బాధితులకు న్యాయం చేస్తామని ప్రకటించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం భూమి యజమానులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో బద్ది పోచమ్మ దేవాలయ అభివృద్ధి సందర్భంగా నిర్వాసితులకు అందించిన ప్రత్యేక ప్యాకేజీ తరహాలోనే చెరువు కట్టక్రింది భూముల యజమానులకు కూడా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల తిరుపతి, పార్టీ నాయకులు మాల్లారం తిరుపతి, కోరేపు వెంకటేష్, ఖమ్మం పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు 1న పల్లగుట్ట పై పరిరక్షణ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం

ముస్తాబాద్/ ఆగస్టు 31 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ గూడూరు గ్రామాల మధ్యన గల పల్లగుట్టను కాపాడాలని పల్లగుట్ట పరిరక్షణ కమిటీ మాజీ సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు బి ఎస్ పి రాష్ట్ర నాయకులు సాకలి రమేష్ ఆధ్వర్యంలో పల్లగుట్ట పరిరక్షణ కొరకు సెప్టెంబర్ 1న నల్లగుట్ట పైన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు నామాపూర్ శివార్ సర్వేనెంబర్ 410 లోని పల్లగుట్ట మైనింగ్ తవకాలతో కనుమార్గ పరిస్థితి కనిపిస్తుంది గతంలో మైనింగ్ లీజుకు తీసుకునే ప్రయత్నం అప్పట్లో తవ్వకాలను పలు గ్రామాల ప్రజల ప్రజా పోరాటాల ద్వారా నిలిపివేయడం జరిగింది ప్రస్తుతం సుమారు నాలుగున్నర ఎకరాలకు ప్రభుత్వ అనుమతులు తీసుకొని పల్లగుట్టను గుల్ల చేసే విధంగా కాంట్రాక్టర్ ముందుకు రావడానికి తీవ్రంగా ఖండిస్తున్నాం పల్లగుట్ట కేవలం మట్టి రాళ్లగుట్ట కాదు గూడూరు గ్రామానికి సహజ రక్షణగా స్థానిక పర్యావరణానికి ఆధారంగా ఉన్నది గుట్టను పూర్తిగా తొలగిస్తే భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు పల్లె జీవజాలం వన్యప్రాణులు వృక్ష సంపదకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది ప్రభుత్వానికి పెద్దగా ప్రయోజనం లేకపోయినా గ్రామానికి మాత్రం తీవ్రంగా నష్టం కలిగించే విధంగా పల్లగుట్ట తవ్వకాలు జరుగుతున్నాయి అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి అనుమతులను పరిశీలించి పల్లెగుట్టను కాపాడాల్సిన అవసరం ఉన్నది మరియు రంగురాళ్ల పేరు మీద పళ్ళ గుట్టను గుల్ల చేయటానికి ప్రయత్నించి ప్రయత్నాన్ని విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేసిన న్యాయబద్ధ పోరాటంతోటైనా ఈ గుట్టను కాపాడుకునే విధంగా పర్యావరణ రక్షించే విధంగా ప్రజలు ప్రజాస్వామిక వాదులు పర్యావరణాన్ని కాపాడాలనుకున్నటువంటి పర్యావరణవేత్తలతో సహా కలిసి ఈ పల్లగొట్టను రక్షించుకునే విధంగా భవిష్యత్తు కార్యక్రమం రూపొందించుకోవడానికి మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు అనగా సెప్టెంబర్ 1వ తేదీన ఉదయం 11 గంటలకు పల్లగుట్ట వద్ద ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాం కార్యక్రమానికి పల్లగుట్ట పరిరక్షణ మేధావి వర్గం ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్ అమలు

- శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఆంక్షలు
- అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సభలు నిర్వహించరాదు: ఎస్పీ మహేష్ బి. గితే



రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 31 ప్రజాదివాస్

జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించే ఉద్దేశ్యంతో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ మేరకు పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం కూడా నిషేధమని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

# జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

- శాంతి భద్రతలకు భంగం కలిగితే కఠిన చర్యలు తప్పవు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి

ముస్తాబాద్/ ఆగస్టు 31 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 తేదీ వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ముస్తాబాద్ ఎస్సై జ్యోతి తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు ర్యాలిలు,పబ్లిక్ మీటింగ్ లు, సభలు ,సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని వారన్నారు



# భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి

- రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 31 ప్రజదివాస్
రాష్ట్రంలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రంలోని రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ, డబ్లింగ్ పనులు, భూసేకరణ పురోగతి తదితర అంశాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ కూడా పాల్గొన్నారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలోని ప్రాజెక్టుల పురోగతిని వివరించారు.ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, రైల్వే ప్రాజెక్టుల విస్తరణకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించి సంబంధిత శాఖలకు అప్పగించాలని సూచించారు. ప్రతి పనికి స్పష్టమైన గడువు నిర్ణయించి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.రైల్వే లైన్ల నిర్మాణం, విస్తరణ, స్టేషన్ల ఆధునీకరణ పనుల పురోగతిపై కూడా సమావేశంలో చర్చించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

- ఎంపీడీవో లచ్చాలు



ముస్తాబాద్/ ఆగస్టు 31 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి 20 ఫిర్యాదులు రావడం జరిగిందని రెవెన్యూ శాఖ 8 అగ్రికల్చర్ 4 హౌసింగ్ రెండు పిఆర్ ఏఈ 1 ఇరిగేషన్ 1 ఎడ్యుకేషన్ 1 ఎస్ హెచ్ ఓ 1 ఎంపీఓ 1 దరఖాస్తులను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించాలని కోరారు ప్రజావాణి కార్యక్రమానికి బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొంపల్లి సురేందర్రావు ఆధ్వర్యంలో మండలంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలను ప్రభుత్వం అధికారులు వెంటనే పరిష్కరించాలని యాప్ ద్వారా రైతులకు సక్రమంగా యూరియా అందడం లేదని ఆరుగాలం కష్టపడి వేసిన పంటకు సరైన సమయంలో యూరియా లేకపోవడం వలన రైతులు నష్టపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే యూరియా యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలో ఫర్టిలైజర్ సహకార సంఘాల మహిళా సంఘాల ద్వారా పాత పద్ధతిలో యూరియాను రైతులకు అందించాలని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి చెవుల మల్లేష్ కంచం నరసింహులు వెంకటేష్ నల్ల నరసయ్య మాజీ సర్పంచ్ శీలం స్వామి రాజు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ చర్య కింద ఇద్దరిని సస్పెండ్

ముస్తాబాద్/ ఆగస్టు 31 ప్రజా దివాస్
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోతుగల్ గ్రామానికిచెందిన తోటధర్మేందర్ మరియు జంగారాజు పార్టీ క్రమశిక్షణ చర్యలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు అందిన సమాచారం మేరకు వీరి ఇద్దరిని కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు హాజరు కాకుండా సస్పెండ్ చేసినట్లు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు ఒక ప్రకటన తెలిపారు


MANDALACONGRESSCOMMITTEE
MUSTHABADMANDAL
H.No.3-79/6,MUSTHABAD,Dist:RajannaSircilla,Telangana-505404
GAJJELARAJU
MandalaPresident,Musthabad
Cell:9963865143
e.mail.:gajjels@gmail.com

Date:- 31-08-2026

మండల కాంగ్రెస్ కమిటీ
సస్పెన్షన్ ఉత్తర్వు

విషయం: తోట ధర్మేందర్ మరియు జంగా రాజు గారిని పార్టీ కార్యకలాపాల నుండి సస్పెండ్ చేయడం సంబంధించి.

పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించినట్లు అందిన ఫిర్యాదులు/సమాచారం ఆధారంగా, సంబంధిత పార్టీ నియమావళి ప్రకారం శ్రీ తోట ధర్మేందర్ మరియు జంగా రాజు గారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ప్రక్రియలో భాగంగా, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు పార్టీ కార్యకలాపాల నుండి తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని ప్రతిపాదించడమైనది.
ఈ నిర్ణయం సంబంధిత కాంగ్రెస్ పార్టీ ముస్తాబాద్ మండల ఆమోదానికి లోబడి ఉంటుంది.

ఇట్లు,
గజ్జల రాజు
[కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ]

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- హామీల అమలులో వెనుకడుగు లేదు.. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తున్నాం
- విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాస్
ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్, అర్బన్ మండలాల్లో నూతనంగా ఎంపికైన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యుల అభినందన సభలో ఆయన మాట్లాడారు.గత పదేళ్ల పాలనలో రాష్ట్రం భారీగా అప్పుల్లో కూరుకుపోయిందని, అలాంటి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

**పేదల సంక్షేమానికి పెద్దపీట**
అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందిస్తూ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేములవాడ నియోజకవర్గంలో మొదటి దశలో 3,500, రెండో దశలో 2,000 ఇళ్లను మంజూరు చేసి నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

**దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి**
కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలకు వాస్తవాలు తెలియజేసి తిప్పికొట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆది శ్రీనివాస్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి**
ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రజలను చేరుకోవడానికి ప్రధాన వేదికగా మారిందని,



కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దీనిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజ్లకి తీసుకెళ్లాలని అన్నారు.

**కులగణన దేశానికే ఆదర్శం**
యం, సమగ్ర అభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# వేములవాడ 10వ వార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

- ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో విద్యుత్ సమస్యకు పరిష్కారం



వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాస్
వేములవాడ పట్టణంలోని 10వ వార్డులో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో వార్డులోని వివిధ ప్రాంతాల్లో 6 నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. మున్నూరు కాపు సత్రం పక్కన గల్లీలోని బండ మల్లేశం ఇంటి వద్ద నుంచి మహమ్మద్ అక్రమ్ ఇంటి వరకు, అలాగే బైపాస్ రోడ్డులోని పుల్కం శ్రీధర్ ఇంటి నుంచి ఈడుగు రాజనర్సు ఇంటి వరకు కొత్త స్తంభాలను అమర్చారు.విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో రాత్రివేళల్లో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని 10వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత శ్రీకాంత్ తెలిపారు. స్తంభాల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వార్డు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసిన విద్యుత్ శాఖ ఏడీ గంగాధర్, ఏఈ సిద్ధార్థ్, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. వార్డు సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

# క్షుద్ర పూజల పేరుతో రూ.62 లక్షల మోసం

- ఇద్దరు నిందితుల అరెస్ట్ - రూ.30.50 లక్షల నగదు స్వాధీనం
- అనారోగ్యం నయం చేస్తామని నమ్మించి మహిళను మోసం చేసిన కేటుగాళ్లు మంత్రాలు, చేతబడులు, గుప్తనిధుల పేరుతో భారీగా వసూళ్లు
- నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు



రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 31 ప్రజాదివాస్

రూపాయలు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం, కరీంనగర్‌కు చెందిన తురుపాటి శ్యాం కుమార్ హైదరాబాద్‌లో పూజా సామాగ్రి దుకాణం నిర్వహిస్తుండగా, వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పత్తెం లక్ష్మీరాజం క్షుద్ర పూజలు, మంత్రాలు చేస్తానని ప్రచారం చేసుకుంటూ ప్రజలను నమ్మించేవాడు. వీరిద్దరూ కలిసి అనారోగ్య సమస్యలు, కుటుంబ కష్టాలు, చేతబడులు తొలగిస్తామని చెప్పి అమాయకులను లక్ష్యంగా చేసుకుని డబ్బులు దోచుకునే కుట్ర పన్నారు.ఈ క్రమంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఓ మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటాన్ని ఆసరాగా చేసుకుని, క్షుద్ర పూజల ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేస్తామని నమ్మించారు. పూజల కోసం, పూజా సామాగ్రి కోసం భారీ మొత్తంలో డబ్బులు అవసరమని చెప్పి విడతల వారీగా నగదు తీసుకున్నారు. యాదగిరిగుట్ట, కాశీ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు నమ్మిస్తూ మరిన్ని డబ్బులు వసూలు చేశారు.అంతేకాకుండా బ్యాంకు ఖాతాల ద్వారా కూడా పెద్ద మొత్తంలో నగదు జమ చేయించుకుని, మొత్తం సుమారు రూ.62 లక్షల వరకు బాధితురాలిని మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితురాలు కోరగా, క్షుద్ర పూజలు చేసి కుటుంబాన్ని నాశనం చేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, అగ్రహారం గ్రామంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, బెల్లంతో తయారు చేసిన బొమ్మలు, పసుపు, కుంకుమ తదితర పూజా సామాగ్రిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును ఛేదించిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గణేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ**
అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, చేతబడులు, మంత్రాలు పరిష్కారం కాదని, అర్హత కలిగిన వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని ఎస్పీ సూచించారు. మూఢనమ్మకాలు, గుప్తనిధులు, పూజల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# అరెకటిక సంక్షేమ సంఘం భవనానికి భూమిపూజ నిర్వహించిన విప్

వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాస్
వేములవాడ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న వేములవాడ మండల అరెకటిక సంక్షేమ సంఘం భవనానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి అవసరమైన సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు తోట రాజు, శేఖర్, శ్రీనివాస్, తుమ్ మధు, నాయకులు కూరగాయల కొమురయ్య, ప్రసాద్, బుట్టి రమేష్, కొలకని రాజు, మల్లేశం, విష్ణు, సిరిగిరి శ్రీకాంత్, గుమ్మడి రాజేష్ గౌడ్, దూలం భూమేష్‌తో పాటు సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు..



# వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం, 32 ఏజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం

**- పార్టీలకు అతీతంగా వేములవాడ అభివృద్ధే లక్ష్యం ,రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు,పట్టణంలో 15 వేల మొక్కల పంపిణీకి నిర్ణయం**
**- వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి: చైర్మన్ పుల్కం రాజు**

వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాస్

వేములవాడ పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో మొత్తం 32 ఏజెండా అంశాలను సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.94 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే వనమహోత్సవంలో భాగంగా పట్టణంలో 15 వేల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికి రెండు మొక్కలు అందించేలా రూ.15 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు.

**పార్టీలకు అతీతంగా అభివృద్ధి**

సమావేశం అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా వేములవాడ పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కౌన్సిల్ పనిచేస్తోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారం, మార్గదర్శకత్వంతో మున్సిపాలిటీకి అవసరమైన ప్రత్యేక నిధులను సమకూర్చుకుంటున్నామని తెలిపారు. రోడ్లు, మురుగు కాలువలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి**

వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు, డ్రైనేజీ పొంగిపొర్లడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చైర్మన్ తెలిపారు. ప్రతి వార్డులో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు



ఫాగింగ్, బ్లీచింగ్ పిచికారీ చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అన్నారు. అలాగే రాత్రివేళల్లో వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల సాగుతో అదనపు ఆదాయం సాధ్యం

**బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో "ఆరోగ్య పుట్టగొడుగులు" శిక్షణ కార్యక్రమం**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 31 ప్రజాదివాస్



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బీజేఆర్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్లలో పుట్టగొడుగుల సాగుపై "ఆరోగ్య పుట్టగొడుగులు" పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ రజియా సుల్తానా, డాక్టర్ లావణ్య మాట్లాడుతూ పుట్టగొడుగుల సాగు రైతులు, మహిళా రైతులు, యువతకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే ఉత్తమ ప్రత్యామ్నాయ వ్యవసాయ రంగమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు కూడా ఈ సాగు దోహదపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ ఎం. రాజేంద్ర ప్రసాద్ శిక్షణలో భాగంగా పుట్టగొడుగుల పెంపకం విధానం, సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, సబ్‌స్ట్రేట్ తయారీ, స్పాన్ ఉత్పత్తి మరియు వినియోగం, వివిధ రకాల పుట్టగొడుగుల లక్షణాలు, పంట సంరక్షణ, మార్కెటింగ్ అవకాశాలు, ఆదాయ వనరులపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే ప్రాయోగికంగా పుట్టగొడుగుల పెంపకానికి సంబంధించిన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, రైతులు, యువ పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి కోరుకునే యువతతో పాటు బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు శివకృష్ణ, ఆస్నా, సౌమ్య, హంపి, మానస, కార్తీక్, కావేరి, శిరీష, లావణ్య తదితరులు పాల్గొన్నారు. పుట్టగొడుగుల సాగుపై ఆసక్తి కలిగిన వారికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# రాజన్న సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రూ.1.71 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం

సిరిసిల్ల జిల్లా ఆగస్టు 31 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 25 అంశాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, నివారణ చర్యలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యుల సూచనలు, సలహాలు స్వీకరించి ప్రతిజ్ఞ చేశారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల కోసం లైటింగ్,




గ్రావెల్, జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ల తదితర పనులకు రూ.29 లక్షలు కేటాయించారు. వివిధ వార్డుల్లో డ్రైనేజీ కల్వర్టులు, డ్రైనేజీలు, బతుకమ్మ పాండ్లు తదితర 8 పనులకు రూ.59 లక్షలు మంజూరు చేశారు. వివిధ వార్డుల్లో స్ట్రీట్ లైట్ల ఏర్పాటుకు రూ.10 లక్షలు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.21 లక్షలు కేటాయిస్తూ పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయ భవనం రెనోవేషన్ కోసం రూ.42 లక్షలు, విద్యానగర్, నెహ్రూనగర్ వైకుంఠధామాల్లో బర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల మరమ్మతులు, ఇతర పనులకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. మొత్తంగా సమావేశంలో రూ.1.71 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు పరిపాలనాపరమైన మంజూరులు లభించాయి. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ లాడ్జిలో వేములవాడ వ్యక్తి మృతి

**- లాడ్జి గదిలో నిర్జీవంగా కనిపించిన వ్యక్తి: కేసు నమోదు**

కరీంనగర్ జిల్లా / ఆగస్టు 31 ప్రజాదివాస్



కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ 9వ డివిజన్‌లో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో వేములవాడకు చెందిన నరాల కార్తీక్ (36) మృతి చెందాడు. రాత్రి లాడ్జి గదిలో బస చేసిన ఆయన ఉదయం ఎంతకీ బయటకు రాకపోవడం, గదిలో నిర్జీవంగా పడి ఉండడాన్ని గమనించిన లాడ్జి సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించి, ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు, మృతికి గల పూర్తి కారణాలు విచారణలో వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 26 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 31 ప్రజాదివాస్

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ



ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# నేరెళ్ల గురుకుల హాస్టల్ వద్ద రోడ్డు ప్రమాదం ఒకరికి గాయాలు




తంగళపల్లి మండలం / ఆగస్టు 31 ప్రజాదివాస్

తంగళపల్లి మండలం నేరెళ్ల హాస్టల్ వద్ద సోమవారం ఉదయం ఆటో, కారు ఢీకొని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లు ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని గ్రామపంచాయతీ, హాస్టల్ యాజమాన్యం మరియు ఆర్‌అండ్‌బీ అధికారులను గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# భీమేశ్వర స్వామిని దర్శించుకున్న గాయని మౌనిక యాదవ్



**- వేములవాడ రాజన్న సన్నిధిలో ప్రముఖ జానపద గాయని ప్రత్యేక పూజలు**

వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాస్

ప్రముఖ జానపద గాయని మౌనిక యాదవ్ కుటుంబ సమేతంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మొక్కుల్లో భాగంగా కోడెను కట్టేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు ఆమె కుటుంబానికి వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం మౌనిక యాదవ్ మీడియాతో మాట్లాడుతూ... రాజన్నను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గతంలో తాను వేములవాడ రాజన్నపై ఆలపించిన భక్తి గీతాలను, శివరాత్రి జాగరణ పాటలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించే భక్తులు పాలు మరిచిన, పూర్తి ఆరోగ్యంగా ఉన్న కోడె దూడలను మాత్రమే ఆలయానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

# భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ

- క్యూలైన్లను పరిశీలించిన డీఈవో, ఈఈ



వేములవాడ / ఆగస్టు 31 ప్రజాదివాన్

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి సన్నిధి మూడో సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల రద్దీ తీవ్రమవ్వడంతో దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈవో) నవీన్ కుమార్, ఈఈ రాజేష్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సాధారణ, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్లలో తోపులాటలు జరగకుండా సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. కోడె మొక్కుల ప్రాంగణం, అద్దె కోడెల విభాగం, నిత్య అభిషేక మండపాలను పరిశీలించి సేవలను వేగవంతం చేశారు. టికెట్ కౌంటర్లు, చెక్‌పోస్టుల వద్ద రద్దీ పెరగకుండా చూశారు. క్యూలైన్లలోని భక్తులతో నేరుగా మాట్లాడి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎస్పీఎఫ్, హోంగార్డు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, శివ సాయి, సీనియర్ అసిస్టెంట్ వంశీ మోహన్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ వివరాలను ఆలయ పిఆర్ఓ పెరిక శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు.

# కాటన్ చీరల కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం



- కూలి పెంచే వరకు పోరాటం ఆపేది లేదు: జ×ఖ
- ఒక్కో చీరకు రూ. 100 కూలి ఇవ్వాలని డిమాండ్
- కూలి ఒప్పందం ముగిసి 30 నెలలైనా యజమానుల నిర్లక్ష్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా / ఆగస్టు 31 ప్రజాదివాన్

సిరిసిల్ల పట్టణంలో కాటన్ చీరలు తయారుచేస్తున్న కార్మికులు, ఆసాములు కూలి పెంపును డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నుండి నిరవధిక సమ్మె ప్రారంభించారు. నెహ్రూనగర్‌లోని అంబా భవాని ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించిన సమావేశంలో సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పాల్గొని మాట్లాడారు. కాటన్ చీరల కూలి ఒప్పందం గడువు ముగిసి ముప్పై నెలలు గడుస్తున్నా యజమానులు కూలి పెంచకపోవడం శోచనీయమన్నారు. పలుమార్లు డిమాండ్ నోటీసులు ఇచ్చినా యజమానుల నుండి సరైన స్పందన రాకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కార్మికులకు ఒక చీరకు వంద రూపాయలు, ఆసాములకు ఒక చీరకు నూట యాభై రూపాయల కూలి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కూలి పెంచే వరకు సమ్మె కొనసాగుతుందని, కార్మికులు మరియు ఆసాములు ఐక్యంగా పాల్గొని ఉదయం తొమ్మిది గంటలకు నెహ్రూనగర్ అంబా భవాని ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాటన్ చీరల కార్మికులు, ఆసాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తి మన బలం.. భద్రత మనందరి బాధ్యత..

-సురక్షితంగా, ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహిద్దాం

-మండపాల వద్ద సీసీ కెమెరాలు రాత్రివేళ నిఘా తప్పనిసరి

-విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తత అవసరం

-డీజేలకు అనుమతి లేదు

-వదంతులు, రెచ్చగొట్టే సందేశాలకు దూరంగా ఉండాలి

-గత సంవత్సరం విపత్తులో అందరి సహకారంతో బయటపడ్డాం

-పోలీస్ శాఖతో సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

-గణేష్ మండలినిర్వాహకులు సూచించిన సలహాలను పరిశీలిస్తాం

-అడిషనల్ కలెక్టర్ విక్టర్

ప్రజాదివాన్

గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శోభాయాత్రలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర గణేష్ మండలి ఎరువాకులను కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పోలీస్ శాఖ సూచనలు పాటించి శాంతిభద్రతలకు సహకరించాలని సూచించారు. కామారెడ్డి కళాభారతీ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్రలపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెంట్ ముకుంద రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు. గతేడాది ఘటనలు పునరావృతం కాకూడదు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవడం కామారెడ్డి జిల్లా ప్రత్యేకత అని ఎస్పీ అన్నారు. గతేడాది మాచారెడ్డి మండలంలో గణేష్ విగ్రహాన్ని తరలించే సమయంలో విద్యుత్ తీగలు తగిలి ఒకరు మృతి చెందగా, కామారెడ్డి ఇంద్రానగర్‌లో విగ్రహ తరలింపు సమయంలో ముగ్గురు గాయపడ్డారని గుర్తుచేశారు. "గతేడాది జరిగిన విషాద ఘటనలు ఈసారి పునరావృతం కాకూడదు. ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా, ఎవరికీ గాయం కాకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలి" అని పిలుపునిచ్చారు. మండపాల భద్రత నిర్వాహకులదే కీలక బాధ్యత గణేష్ మండపాలను ప్రజా రవాణాకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహ పరిమాణానికి అనుగుణంగా స్టేజ్‌ను ఏర్పాటు చేయాలని, రహదారులను ఆక్రమించేలా భారీ స్టేజ్‌లు ఏర్పాటు చేయకూడదన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు ఏర్పాటు చేసి క్రమశిక్షణతో దర్శనం జరిగేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల భద్రత, దొంగతనాల నివారణ కోసం మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళ నిర్వాహకులు లేదా సంబంధిత వ్యక్తులు మండపం వద్ద కాపలాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద పోలీస్ పాయింట్ బుక్ ఏర్పాటు చేస్తామని, పోలీస్ సిబ్బంది తనిఖీకి వచ్చినప్పుడు వారి సూచనలు, తనిఖీ వివరాలను అందులో నమోదు చేయాలని చెప్పారు. విగ్రహాల రవాణాలో అప్రమత్తత విగ్రహాలను మండపాలకు తరలించే సమయంలో నిర్వాహకులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. విగ్రహం ఎత్తు, వాహనం ఎత్తు, రహదారిపై ఉన్న విద్యుత్ తీగల పరిస్థితిని ముందుగానే పరిశీలించాలని తెలిపారు. విద్యుత్ తీగలకు విగ్రహాలు తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే రవాణా చేయాలని, విగ్రహ పరిమాణానికి అనుగుణమైన వాహనాన్ని వినియోగించాలని సూచించారు. వేగం కంటే భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. విద్యుత్, అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక జాగ్రత్తలు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండపాల్లో విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు, సౌండ్ సిస్టమ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. తడిగా ఉన్న ప్రదేశాల్లో విద్యుత్ పరికరాలను ఉపయోగించకూడదని, విద్యుత్ ఏర్పాట్లను నిపుణులచే చేయించుకోవాలని తెలిపారు. దీపాలు, ప్రమిదలు, కొవ్వొత్తులు ఏర్పాటు చేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మండపాల సమీపంలో మండే వస్తువులు లేకుండా చూడాలని సూచించారు. అవసరమైన చోట ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఫైర్ బాల్స్ లేదా నీటి బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. డీజేలకు అనుమతి లేదు గణేష్ ఉత్సవాలను సాదాసీదాగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు. డీజేలు, అనవసర ఆర్భాటాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకర కార్యక్రమాలు నిర్వహించడం, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు లేదా పాటలు నిర్వహించడం వంటి వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. -వదంతులను నమ్మొద్దు...సోషల్ మీడియా, వాట్సాప్ తదితర మాధ్యమాల్లో వచ్చే దురుద్దేశపూర్వక, రెచ్చగొట్టే సందేశాలు, వదంతులను నమ్మవద్దని ఎస్పీ కోరారు.




అనుమానాస్పద సమాచారం అందితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండపాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు లేదా ఇతర అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. -నిమజ్జన శోభాయాత్రలో పోలీసులకు సహకరించాలి గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ కోరారు. ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. అన్నదాన కార్యక్రమాల వద్ద తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. -సమన్వయంతో విజయవంతం చేద్దాం... పోలీస్ శాఖ, ఉత్సవ నిర్వాహకులు, యువత, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించవచ్చని ఎస్పీ తెలిపారు. "ఈ సంవత్సరం మన పండుగలో ఆనందమే ఉండాలి.. విషాదానికి చోటు ఉండకూడదు. ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. -భక్తి మన బలం.. భద్రత మనందరి బాధ్యత... అందరి సహకారంతో సురక్షిత గణేష్ ఉత్సవాలు మన సంకల్పం" అని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పిలుపునిచ్చారు. -అడిషనల్ కలెక్టర్ విక్టర్ ...మండలి నిర్వాహకులు సూచించిన సూచనలు బాగున్నాయని జిల్లా స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలపై సమీక్షిస్తామని అడిషనల్ కలెక్టర్ విక్టర్ గణేష్ మండల్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు పార్టీల నాయకులు, గణేష్ మండలి నిర్వాహకులు, డీఎస్పీలు, సిఐలు, ఎస్సై లు, ట్రాఫిక్ పోలీసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలి

- సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి డిమాండ్

- సిపిఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో

ప్రజాదివాన్

ఈరోజు ఆర్మూర్ తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం సిపిఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశు పట్టణ కార్యదర్శి కోతాడి ఎల్లయ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఆర్మూర్ పట్టణంలో నిరుపేదలు ఇల్లు లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత 30 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం కూడా ఇల్లు ఇచ్చినటువంటి పరిస్థితి లేదని అన్నారు. దరఖాస్తు చేసినప్పుడు జిరాక్స్ లకి వందలాది రూపాయలు ఖర్చవుతున్నాయి కానీ నిరుపేదలకు ప్రయోజనం ఏమి లేదని అన్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్మూర్ పట్టణంలో నిరుపేదలను గుర్తించి అర్హులైనటువంటి వారికి ఎలాంటి అవగతం లేకుండా డబుల్ బెడ్ రూమ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు డబుల్ బెడ్ రూమ్ రాని నిరుపేదలందరికీ కూడా ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి పది లక్షల లోను మంజూరు చేసి ఇవ్వాలని అలాగే ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వాళ్ళందరికీ కూడా పట్టాలు ఇవ్వాలని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినటువంటి వాగ్దానాలు పేదలకి వృద్ధులకు పెన్షన్ పెంచుతామని 4000 పెంచలేదని అన్నారు కొత్తగా దరఖాస్తులు తీసుకున్నారు తప్ప ఎప్పటి నుంచి ఇస్తామనేటటువంటిది ఇంకా కాలయాపన చేయటం తగదని తక్షణమే దరఖాస్తుల తీసుకున్న వాళ్ళందరికీ కూడా పెన్షన్ మంజూరు చేసి ఇవ్వాలని అట్లాగే




వికలాంగులకు 6, పెన్షన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ డివిజన్ నాయకులు పే భూమన్న, రవి, నగేష్ గౌడ్, సాయిలు, అమీర్ ఖాన్, షాహిదా బేగం, కల్లుబాయి, విట్టల్, రాదా లక్ష్మి, పద్మ, సంతోషి తదితరులు పాల్గొన్నారు,విప్లవ అభినందనలతో కూతాడి ఎల్లయ్య సిపిఎం పట్టణ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రైవేటు ఐవీఎఫ్ సెంటర్ల పనితీరుపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

- ప్రైవేట్ సెంటర్ల నియంత్రణ ప్రభుత్వ సెంటర్ల విస్తరణ పై సమీక్షిస్తున్న మంత్రి



ప్రజాదివాస్

రాష్ట్రంలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించడంతో పాటు, ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే సెంటర్లపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ల పనితీరు, ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై మంత్రి సోమవారం సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

గాంధీ హాస్పిటల్, పేట్లబుర్జు హాస్పిటల్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ ఐవీఎఫ్ సెంటర్ల పనితీరును మంత్రి సమీక్షించారు. ఈ రెండు సెంటర్లలో కలిపి ఇప్పటివరకు 39,802 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించామని అధికారులు తెలిపారు. 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు చేసినట్లు మంత్రికి వివరించారు. ఎంతో మంది దంపతులు తమ సంతాన కలను నెరవేర్చుకోవడంలో గాంధీ, పేట్లబుర్జు ఐవీఎఫ్ సెంటర్లు ఉపయోగపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. గాంధీ హాస్పిటల్‌లో ఐవీఎఫ్ సెంటర్‌ను 2024 అక్టోబర్‌లో, పేట్లబుర్జులోని ఎంజీఎంహెచ్‌లో ఐవీఎఫ్ సెంటర్‌ను 2024 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ రెండు సెంటర్లు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, జిల్లాల్లోనూ దశలవారీగా ఐవీఎఫ్ సేవలను విస్తరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు రాష్ట్రంలో ప్రస్తుతం 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు రిజిస్టర్ అయి ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. వీటిలో 129 ఏఆర్‌టీ లెవల్-1, 226 ఏఆర్‌టీ లెవల్-2, 59 ఏఆర్‌టీ బ్యాంకులు, 63 సరోగసి క్లినిక్‌లు ఉన్నాయని తెలిపారు. ఏఆర్‌టీ, సరోగసి చట్టాల ప్రకారం సెంటర్ల కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. సెంటర్లలో సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్, రికార్డుల నిర్వహణ, గ్రీవెన్స్ సెల్ తదితర అంశాలను తనిఖీ చేయాలని సూచించారు. గీత దాటితే కఠిన చర్యలు ప్రైవేట్ ఫర్టిలిటీ సెంటర్లలో అధికారులు నిర్వహించిన తనిఖీలపై మంత్రి ఆరా తీశారు. 379 సెంటర్లను తనిఖీ చేయగా, 50 సెంటర్లలో డీవియేషన్స్ గుర్తించినట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ మంత్రికి తెలిపారు. సిబ్బంది మార్పు, రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ప్రదర్శించకపోవడం, గ్రీవెన్స్ సెల్ నిర్వహించకపోవడం, రిజిస్ట్రేషన్‌లో ఉన్న చిరునామా కాకుండా మరోచోట సెంటర్ నిర్వహించడం వంటి డీవియేషన్స్ గుర్తించినట్లు వివరించారు. ఆయా సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, నిబంధనల ఉల్లంఘనల తీవ్రతను బట్టి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన 2 సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేయగా, 9 సెంటర్ల అనుమతులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే సెంటర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ఫర్టిలిటీ సేవల పేరుతో పేషెంట్లపై అనవసర ఆర్థిక భారం మోపకుండా, పారదర్శకతతో సేవలు అందేలా చూడాలని మంత్రి సూచించారు. సెంటర్లలో వినియోగిస్తున్న మందులు, ఇంజక్షన్లు, వాటి తయారీ సంస్థలు, ఎంఆర్‌పీ తదితర అంశాలను కూడా తనిఖీల్లో పరిశీలించాలని ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి హాస్పిటళ్లు, స్కానింగ్ సెంటర్లలో ఈ ఏప్రిల్ నుంచి జూలై వరకు 2,600 తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. 52 సెంటర్లలో 37 డీవియేషన్స్ గుర్తించి, షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే అవకాశమున్న కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ రంగంలో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించడంతో పాటు, ప్రైవేట్ రంగంలో నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, చట్టబద్ధతను నిర్ధారించేలా పర్యవేక్షణను మరింత పటిష్టం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యానారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, ఐవీఎఫ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్రతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రజలకు ఉచిత కంటి, దంత వైద్య సేవలు విజయవంతం.



ప్రజాదివాస్

ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆగస్టు 31న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఉచితంగా పరీక్షలు నిర్వహించిన స్మార్ట్ మాక్స్ విజన్ కంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారికి, తార డెంటల్ ఆసుపత్రి వారికి ప్రత్యేక ధన్యవాదములు. ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఐ ప్రభాకర్ ఒకమిటీ సభ్యులు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది మరియు సామాన్య ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఆగస్టు 31, సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు గట్టయ్య సెంటర్‌లోని మహారాష్ట్ర బ్యాంక్ పైన రెండో అంతస్తులో ఈ శిబిరం జరుగింది. శిబిరంలో జర్నలిస్టులకు, ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, ఉచిత దంత వైద్య పరీక్షలు, అవసరమైన వైద్య సలహాలు అందించినారు. కంటి విభాగంలో దృష్టి సమస్యలు, కంటి సంబంధిత ఇతర సమస్యలను వైద్యులు పరీక్షించి తగిన సూచనలు అందించినారు. అలాగే దంత విభాగంలో పళ్ల సమస్యలు, చిగుళ్ల సమస్యలు, దంతాల శుభ్రత, రూట్ కెనాల్ తదితర సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు ఇచ్చినారు. మీడియా రంగంలో నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని కావున ప్రెస్ క్లబ్ లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# మునిపల్లి ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక,

- సెప్టెంబర్ 9 చలో వరంగల్ జాతీయ మహాసభను విజయవంతం చేయండి,
- అసమానతలు లేని సమసమాజ నిర్మాణానికి, మహాజనుల రాజ్యాధికారానికి సిద్ధం కావాలి

ప్రజాదివాస్



ఆందోల్ నియోజకవర్గం మునిపల్లి మండలంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు, మునిపల్లి మండలం కోఆర్డినేటర్ జంగం నవీన్ మాదిగ , అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూర్ర సంతోష్ మాదిగ అధ్యక్షతన, మునిపల్లి మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వి ఎస్ రాజు మాదిగ,రామారపు శ్రీనివాస్ మాదిగ,, ఎమ్మార్పీఎస్ మాజీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,మైసగల్ల బుచేంద్ర మాదిగ పాల్గొని మాట్లాడుతూ అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం, భవిష్యత్తులో మహాజనుల రాజ్యాధికారం సాధించేందుకు ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు నిర్మాణం చేయాలని, చలో వరంగల్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు అనంతరం మునిపల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మునిపల్లి మండల నూతన కమిటీ

మండల అధ్యక్షుడు:జంగం విజయ్ ప్రసాద్ మాదిగ,అధికార ప్రతినిధి:పరిచర్ల డేవిడ్ మాదిగ,ప్రధాన కార్యదర్శి: మర్పల్లి సుధాకర్ మాదిగ, ఏర్పుల నరేందర మాదిగ,ఉపాధ్యక్షులు:జంగం రాజు మాదిగ,కార్యదర్శి:మార్పల్లి భూపతి మాదిగ,సహాయ కార్యదర్శి:కోనేటి పవన్ మాదిగ,ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జిల్లా నాయకులు గంధగల వీరయ్య మాదిగ, మునిపల్లి మండల కోఆర్డినేటర్ జంగం నవీన్ కుమార్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# తాడ్వాయి ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు..!

- మూడో విడత ప్రజావాణికి కదిలిన లబ్ధిదారులు.. సమస్యలపై విన్నపాలు
- ఇందిరమ్మ ఇళ్లు,భూ సమస్య, పింఛన్‌పై అర్జీలు..
- పరిష్కరిస్తామని సంబంధిత అధికారుల హామీ
- లింగాల,నార్లాపురం,లవ్వాల,ఇందిరానగర్ గ్రామాల నుంచి హాజరైన ప్రజలు





ప్రజాదివాస్

ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మూడో విడత ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్జీలు సమర్పించారు. ప్రధానంగా లవ్వాల గ్రామానికి చెందిన మహిళలు ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్జీలు అందజేశారు. లవ్వాల నుంచి వచ్చిన మహిళల అర్జీలను పరిశీలించి,కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యపరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. దీంతో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. నార్లాపురం గ్రామానికి చెందిన ఓ లబ్ధిదారుడు భూ సమస్యపై ప్రజావాణిలో అర్జీ సమర్పించారు. అర్జీని పరిశీలించిన ఎంపీడీఓ,సమస్య పరిష్కారం కోసం సర్వేయర్‌ను పంపిస్తామని తెలిపారు. దీంతో లబ్ధిదారుడు సంతృప్తి వ్యక్తం చేశారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ వృద్ధాప్య పింఛన్ కోసం అర్జీ సమర్పించారు. పింఛన్ మంజూరుకు కొంత సమయం పడుతుందని ఎంపీడీఓ వివరించారు. సమస్యపై స్పష్టత ఇవ్వడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కాటాపురం గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించిన ఎంపీడీఓ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి హాజరైన అధికారులు....**

తాడ్వాయి మండలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. కాటాపురం పీహెచ్‌సీ నుంచి మలేరియా సూపర్‌వైజర్,తాడ్వాయి పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యులు డాక్టర్ సంతోష్, ఐకేపీ ఏపీఎం కిషన్,సీసీ,హౌసింగ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్,పోలీసుశాఖ నుంచి ఏఎస్సై,కానిస్టేబుల్,రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ రాజు,వ్యవసాయ శాఖ నుంచి ఏఓ,ఏఈఓ దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి,ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

# డా.ఉమా శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన డా.పెసరు విజయచందర్ రెడ్డి

ప్రజాదివాస్



సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి డాక్టర్ ఉమా శంకర్ కుమార్తె దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం కల్పించారు. ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.

# ఆత్మకూరు పెద్దమ్మ తల్లి ఆలయానికి రాతి దర్వాజా బహూకరణ

- తమ తల్లిదండ్రులు భాష బోయిన కొమురమ్మ సమ్మయ్య ల జ్ఞాపకార్థం
- దాత భాషబోయిన సాగర్ ఆత్మకూరు మాజీ రైతు కోఆర్డినేటర్



ప్రజాదివాస్

ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయానికి రాతి దర్వాజా నిర్మించారు. రాతి దర్వాజా దాత ఆత్మకూరు మాజీ రైతు కోఆర్డినేటర్ భాష బోయిన సాగర్. తమ తల్లిదండ్రులు కీర్తిశేషులు భాష బోయిన కొమరమ్మ - సమ్మయ్యల జ్ఞాపకార్థం బహూకరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఉప సర్పంచ్ భాష బోయిన పైడి ,భాష బోయిన స్వరూప- సాగర్, భాషా బోయిన శ్రీజ -రాజు, భాషా బోయిన సింధూజ- రమణ ,భాషా బోయిన శ్వేత -ఆర్య, భయ్యా బాబు , గుండె బోయిన రజిత- కుమార్, బగ్గి అశోక్ గుండెబోయిన రఘుపతి తదితరులు దంపతుల తో సహా పాల్గొన్నారు.